యువకుడి రక్తదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ మండలం రేగులగూడకు చెందిన మడావి కాశీరాంకు సామాజిక కార్యకర్త మాడిశెట్టి ప్రశాంత్ రక్తదానం చేశారు. కాశీరాం రక్తహీనతతో బాధపడుతూ అత్యవసరంగా అరుదుగా లభించే ఎబి(పాజిటివ్) రక్తం కావాల్సి వచ్చింది. స్థానికుడు అజయ్ ద్వారా ప్రశాంత్ బాధితుడికి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, దీనివల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామని తెలిపారు. రక్తదానం చేసేవారు 9573854347, 8639434390 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



అనుదినం జనస్వరం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

1

ఆదివారం 09 ఏప్రిల్ 2023

14 నుండి ప్రవేశ పరీక్షల ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు వివిధ ప్రవేశ పరీక్షల కోసం ఈ నెల 14 నుండి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కన్వీనర్, డీఈఓ. అశోక్, కో కన్వీనర్ గడ్డం భిక్షపతి, కో ఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్, టీఎస్ఆర్‌జేసీ ప్రవేశపరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు 9441140434 నెంబర్‌కు ఈ నెల 12 లోగా విద్యార్థి పేరు. పాఠశాల పేరు, గ్రామం పేరుతో వాట్సప్ చేయాలని వారు తెలిపారు.

ఉపాధి దూరం..ఇప్పపువ్వే ఆధారం..!

- ఉదయాన్నే అడవుల్లోకి వెళ్లి సేకరణ
- వేసవిలో గిరిజనుల జీవనోపాధికి ఊతం

రాష్ట్రమంతా ఉపాధి పనులు జరుగుతుంటే.. ఆ ఊరిలో మాత్రం ఈ పని ఊసే లేకుండా పోయింది. ఈ పల్లె ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా ఉపాధి పనులు మాత్రం చేపట్టడం లేదు. ఉపాధి పనులు లేకపోవడంతో వేసవిలో ఇప్పపువ్వు సేకరణతో జీవనోపాధి పొందుతున్నారు ఆదిలాబాద్ గ్రామీణ మండలం జంబుల్‌ధరి పంచాయతీ పరిధిలోని అడ్డగుట్ట గ్రామస్తులు. ఉపాధి పనులు ప్రారంభమైన 2005 నుంచి ఇప్పటి వరకు ఈ గ్రామంలో పనులు లేకుండా పోయాయి. ఇప్పటి వరకు జాబ్‌కార్డులు లేని ఈ గ్రామస్తుల దుస్థితిని అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. వేసవిలో ఉపాధి పనులు లేకపోవడంతో ఇప్పపువ్వు సేకరణతోనే ఉపాధి పొందుతూ కాలం గడుపుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గిరిజన పల్లెలు ఇప్పటికీ మౌళిక వసతుల కోసం ఎదురుచూస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాయి. వేసవిలో పల్లెలన్ని ఉపాధి పనులతో తీరిక లేకుండా ఉంటే.. ఈ పల్లె మాత్రం పనుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గ్రామంలో ఇప్పటికీ ఉపాధిహామీ జాబ్‌కార్డులు లేకపోవడంతో ఈ పనులంటే తెలియని పరిస్థితి ఉంది. పనుల కోసం పంచాయతీ పాలకులు, అధికారులను అడిగినా ఇప్పుడు అప్పుడు అంటూ దాటవేస్తున్నారు. ఫలితంగా పనులు లేక కుటుంబ పోషణ కష్టంగా మారడంతో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అనాదిగా వస్తున్న ఇప్పపువ్వు సేకరణనే ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. తెల్లవారుజామున అడవిలోకి వెళ్లి ఇప్పపువ్వును సేకరిస్తూ నాలుగు రోజుల పాటు ఇంటి ఆవరణలో ఆరబెడుతున్నారు. తెల్లని రంగు నుంచి ఎరుపు రంగులోకి మారిన తర్వాత డీఆర్‌డీపోలకు తీసుకెళ్లి కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.



మా ఊరిలో ఎవరికి జాబ్‌కార్డు లేవు : యశ్వంత్, గ్రామస్తుడు



మా ఊరిలో ఎవరికి జాబ్‌కార్డు లేవు. అనేక ఏండ్ల నుంచి ఈ పనులు చేయడం లేదు. జాబ్‌కార్డుల కోసం అధికారులను అడిగినా ఇప్పుడు అప్పుడు అంటూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా వేసవిలో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. అధికారులు దృష్టిసారించి మా ఊరిలో ఉపాధి పనులు కల్పించాలి.

ఇప్పపువ్వుతోనే జీవనాధారం : కొడప జంగుబాయి, అడ్డగుట్ట



వేసవిలో వ్యవసాయ పనులు ఉండవు. ఉపాధిహామీ పనులు కూడా మా ఊరిలో చాలా ఏండ్ల నుంచి చేపట్టడం లేదు. జాబ్‌కార్డులు కూడా లేవు. దీంతో ఇప్పపువ్వు సేకరణతోనే ఉపాధి పొందుతున్నాం. తెల్లవారుజామునే అడవికి వెళ్లి సేకరిస్తూ డీఆర్‌డీపోలో విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతున్నాం.

మోడీ రాకను వ్యతిరేకిస్తూ నిరసనలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ కార్మిక, కర్షక వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పర్యటనకు వచ్చే ముందు తెలంగాణ ప్రజలకు నరేంద్ర మోడీ ఏం చేశాడనే విషయాన్ని తెలియజేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇదే జరిగితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. రవాణా చట్టం తీసుకొచ్చి ప్రభుత్వ రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. రవాణా చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీలోకి తీసుకురావాలన్నారు. తెలంగాణపై మోడీ కపట ప్రేమ వీడి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ డిపో సెక్రటరీ టి.దివాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, శంకర్, నాయకులు ఇజాజ్, దివాకర్, ఆనంద్, నరేష్, మోహన్, రాంప్రసాద్, తుకారాం, హేమాజి పాల్గొన్నారు.





ముథోల్ : తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి రావడాన్ని నిరసిస్తూ నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గైని మురళీమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గంధం లింగన్న పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- కుట్టుమిషన్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా తిర్యాణిలో జిల్లా పోలీస్, వసుధ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయంతో మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసుధ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మంచి అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి కోసం ఎవరిపై ఆధారపడకుండా, ప్రతి మహిళ స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. మహిళలకు ఎవరూ సాటి రారని, గొప్పగా ఆలోచించే శక్తి వారికే సాధ్యమని పేర్కొన్నారు. జిల్లాలో వసుధ స్వచ్ఛంద సంస్థ వసుదైక కుటుంబం కోసం కృషి చేస్తుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ వల్ల ప్రజల్లో పోలీసులకు స్నేహపూరిత వాతావరణం నెలకొందని, ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. అసాంఘిక శక్తులకు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని సూచించారు. యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ప్రజల ధన మానప్రాణలను రక్షించటంలో పోలీసులు ముందుంటారని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య ఉన్న డయల్ 100కి కాల్ చేసి తెలియజేయాలని లేదా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం కుట్టు మిషన్లు అందించి, టైలరింగ్ సర్టిఫికెట్స్ అందించారు. గొప్ప కార్యక్రమం చేపట్టిన వసుధ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ ఉమ, టైలరింగ్ శిక్షకురాలు రమాదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అచ్చేశ్వర్‌రావు, వసుధ స్వచ్ఛంద కో-ఆర్డినేటర్ ఉమ, ఆసిఫాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్, రెబ్బెన సిఐ నరేందర్, తిర్యాని ఎస్ఐ రమేష్, తిర్యాణి గ్రామ సర్పంచ్ సింధూజ, రాళ్లకన్నేపల్లి గ్రామ సర్పంచ్ గుణవంతరావు పాల్గొన్నారు.





ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని గుడ్లబోరి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం మొదటి బహుమతి ముత్తంపేట్ టీంకు, రెండో బహుమతి గుడ్లబోరి టీంకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గుడ్లబోరి సర్పంచ్ రాందాస్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వర్షంతో రైతులకు తిప్పలు



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రైతులకు నష్టం వాటిల్లింది. వర్షంతో మొక్కజొన్న, వరి రైతులకు కష్టాలు తప్పలేదు. కొందరు మొక్కజొన్న రైతులు మొక్కజొన్న పంటను కోసి కల్లాలో ఆరబెట్టగా కురిసిన వర్షానికి అంత తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిస్తే ఆశించిన స్థాయిలో ధర ఉండదని వాపోతున్నారు. వరి రైతులు సైతం నష్టపోయారు. వరి పంట పొట్ట దశలో ఉండటంతో వర్షానికి దెబ్బతింటుందని రైతులు పేర్కొంటున్నారు.

దివ్యాంగులు బస్సు పాసులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

దివ్యాంగులు బస్సు పాసులను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ ఎన్ సాయన్న అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు పాసుల మేళా నిర్వహించారు. దివ్యాంగులకు 50శాతం రాయితీతో పాసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన 35 మందికి 50 శాతం రాయితీతో బస్ పాసులను అందజేశామన్నారు. వీటితో దివ్యాంగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో సగం చార్జీతో ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్‌పాస్ సిబ్బంది లక్క నర్సయ్య, డి.గంగన్న, ఖానాపూర్ కంట్రోలర్ అజ్మీరా శంకర్ నాయక్, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

రెబ్బెనలో వేణుకుమార్ సంతాప సభ



నవతెలంగాణ - రెబ్బెన

మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర వహించి ప్రాణత్యాగం చేసిన తెలంగాణ అమరవీరుడు పాలపెల్లి వేణుకుమార్ 11వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆసిఫాబాద్ ఏఎంసీ చైర్మన్ గాదవేని మల్లేష్, రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ప్యాక్స్ చైర్మన్ కార్నాదం సంజీవ్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి హాజరయ్యారు. వేణుకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో వేణుకుమార్ కీలకపాత్ర పోషించారని, తెలంగాణ వస్తే తన లాంటి మరెందరికో ఉద్యోగాలు వస్తాయనే ఉద్దేశంతో ప్రాణత్యాగం చేశారని గుర్తు చేసుకున్నారు. 12వ వర్ధంతి వరకు విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గౌడ కులస్తులు, మిత్రులు పాల్గొన్నారు.

పరీక్ష సెంటర్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం అడిషనల్ కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రబీంద్ర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. పలు వివరాలను చీఫ్ సూపరింటెండెంట్‌లకు అడిగి తెలుసుకున్నారు.

తాంసి : మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా విద్యాధికారిణి ప్రణీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్విజిలేటర్లకు, పరీక్ష పరిశీలన అధికారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం కల్పించొద్దన్నారు. సెల్‌ఫోన్ లోనికి అనుమతించొద్దని తెలిపారు. ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరె సంఘం నాయకునిపై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై జరిగిన దాడి పట్ల రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివాజీని శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ శివాజీపై దాడికి కారణం బీఆర్ఎస్ నాయకుడు లింగంపల్లి కిషన్‌రావు అని తెలిసినా ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమని అన్నారు. కాగజ్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన ఆరె సంక్షేమ సంఘం సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సంఘం బహిష్కృత నేత లింగంపల్లి కిషన్‌రావును తీసుకువచ్చి అక్కడే సంఘాన్ని చీల్చే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. ఆ సమావేశంలోనే రెండు వర్గాల మధ్య తోపులాట జరిగిందని, నేడు శివాజీపై జరిగిన దాడికి ఆ సంఘటనే బీజం పోసిందని ఆయన ఆరోపించారు. పరోక్షంగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కూడా ఈ దాడికి కారణమైనందున పోలీసు శాఖ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట ఆరె సంక్షేమ సంఘం సిర్పూరు తాలూకా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ ఉన్నారు.

ఐకేపీ వీఓఏల సమ్మె బాట



నవతెలంగాణ-భైంసా

రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని ఐకెపి వివోఏలు శనివారం సమ్మె బాట పట్టారు. అందులో భాగంగా ఎంపీపీ, జడ్పిటిసిలకు వినతి పత్రాలను అందించారు. తొమ్మిది సంవత్సరాలుగా కేవలం రూ.3900 గౌరవ వేతనంతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ఖాతాల్లో వేతనం వేయడంతో పాటు అర్హులైన వివోఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. అనంతరం నాయకులు గణేష్ పటేల్, భీంరావు సోలంకి, రాజుకు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు జైశీల, కార్యదర్శి కల్పన, కోశాధికారి గంగాధర్‌తో పాటు వీఓఏలు పొచ్చిరాం, మోహన్, ప్రకాష్, లచ్చన్న, రమేష్, విఠల్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి, విగ్రహావిష్కరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్ తెలిపారు. ఇటీవల ఉత్సవ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకోగా శనివారం కమిటి సభ్యులను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని దుర్గం ట్రస్ట్ కార్యాలయం వద్ద టపాసులు పేల్చి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నెరవేర్చి జయంతి ఉత్సవాలను విజయవంతం చేసే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను సత్కరించి అభినందనలు తెలియజేసిన శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. జయంతి వేడుకలతో పాటు విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేశామని గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాబా సాహెబ్ కాంబ్లే, రామచంద్ర మహాత్మే, బీఆర్ఎస్ యువ నాయకులు జంగిలి ప్రశాంత్, మహేశ్, ఇచ్చోడ ఆత్మ చైర్మన్ రవీందర్, ఉప సర్పంచ్ సుదర్శన్, నాయకులు గోవిందరావు, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత : సీఐ సాదిక్‌పాషా



నవతెలంగాణ - కౌటాల

యోగాతో మానసిక ప్రశాంతత పొందాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ మంచిర్యాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో సీఐ సాదిక్‌పాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి రోజుల్లో అధికంగా ఆలోచించి రోగాలను తెచ్చుకుంటున్నారని, వీటన్నింటికీ శాశ్వత మార్గం యోగా చేయడమేనని తెలిపారు. యోగాతో అనేక లాభాలున్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని మానసికి ప్రశాంతతను అలవరుచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొని యోగాసనాలు చేశారు.

రేపు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ గజానంద్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ పరమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్, ఖాసీం ఉన్నారు.

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత

నవతెలంగాణ-తాంసి

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని పొన్నారి గ్రామంలో చోటు చేసుకుంది. గేదె యజమాని నోముల పండరి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఎప్పటి లాగే పంట చేనులో మేత మేయడానికి వెళ్లగా పంట చేనులో విద్యుత్ తీగ కింద పడి ఉండటంతో తీగకు గేద తాకడంతో విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడింది. సంఘటన స్థలానికి విద్యుత్‌శాఖ అధికారితో పాటు పశువైద్యాధికారి చేరుకొని పంచనామా నిర్వహించారు. గేదె విలువ రూ.50వేలు ఉంటుందని తెలిపారు.



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

- ముున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలోనే పట్టణ అభివృద్ధి జరుగుతోందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని మూడో వార్డులో రూ.30లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు మురుగు కాలువల నిర్మాణానికి వార్డు కౌన్సిలర్ సాయిప్రణయ్‌తో కలిసి భూమిపూజ చేశారు. అలాగే 222 మంది లబ్దిదారులను గుర్తించి పెన్షన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ మూడో వార్డు పరిధిలో ఇప్పటివరకు దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తిర్పెల్లి, జీడీసీ, జీఎస్ ఎస్టేట్, బెల్లూరి పరిధిలో వార్డు ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. గతంలో ఇక్కడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, రహదారి అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ద్వారా ప్రస్తుతం ఇబ్బంది దూరమైందని వివరించారు. మౌలిక వసతుల కల్పనే కాకుండా సుందరీకరణపై సైతం ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆయన గతంలో అభివృద్ధికి నోచుకోని పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతోందని, ముఖ్యంగా మహిళల సంక్షేమాన్ని కాంక్షించి బృహత్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నాయకులు మిషు, అశోక్, ఈశ్వర్, ప్రభ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్యారామూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చాకలి భూమన్న కుటుంబాన్ని శనివారం నిర్మల్ బాగులవాడ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ పరామర్శించారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.11వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన రాజేందర్‌ను పలువురు అభినందించారు. ఆయన వెంట ఎఎంసీ డైరెక్టర్ సాయన్న, గ్రామ యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

కంటి వెలుగు కండ్లద్దాల పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మహాగావ్ గ్రామపంచాయతీ పరిధిలోని షేకుగూడ గ్రామంలో శనివారం పది మందికి కండ్లద్దాలను హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ పంపిణీ చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏండ్లపై బడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్యసిబ్బంది ఈశ్వర్, గిరిజాబాయి ఉన్నారు.

మోడీ సభకు తరలిన మండల బీజేపీ శ్రేణులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగనున్న ప్రధాని మోడీ సభకు శనివారం మండల బీజేపీ నాయకులు తరలి వెళ్లినట్టు మండల బీజేపీ నాయకులు గుడ్ల రంజిత్ తెలిపారు. రాబోయే రోజుల్లో అధికారమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. మోడీ పట్ల బీఆర్ఎస్ నాయకుల తీరు ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఫామ్ హౌస్ సీఎంకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. సభకు వెళ్లిన వారిలో బీజేపీ నాయకులు, గోవర్దన్, రాపని గంగాధర్ ఉన్నారు.

రామాలయ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని రామాలయ నిర్మాణ పనులు ప్రారంభమైనట్టు ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గర్భ గుడి, పిల్లర్ గుంతలు తీసినట్టు తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. అలాగే బ్రహ్మేంద్రస్వామి ఆలయానికి, రాజ రాజేశ్వర స్వామి ఆలయ ప్రహరీకి రూ.15లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

నవతెలంగాణ-బేల

ఎమ్మెల్యే జోగు రామన్న 30సంవత్సరాల రాజకీయంలో ఎస్సీ, ఎస్టీ, బీజీ, మైనార్టీ, ఓసీ, అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కళ్లెం ప్రమోద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న బీసీలకు చేసింది ఏమిలేదని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి ఆరోపించడం సరైందికాదని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మంత్రిగా ఉన్నప్పుడు బీసీలకు, ఓసీలకు ఏం చేశారో వివరించారు. అదే విధంగా ఒక అవాల్‌పూర్ గ్రామంలోనే రూ.11.40లక్షలు అభివృద్ధి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, ఒల్లఫ్‌వార్ దేవన్న, సర్పంచ్‌లు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, విపిన్ ఖోడే పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు పడి మొక్కజొన్న పంట దగ్ధం

నవతెలంగాణ-సారంగాపూర్

విద్యుత్ తీగలు పడి మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని జామ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... జామ్ గ్రామానికి చెందిన కందెల భోజన్న గ్రామ శివారులోని నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న వేశాడు. పంట కోసి కుప్పలుగా వేశారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పంట చేను మీదుగా దుర్గనగర్ వెళ్లే విద్యుత్ లైన్ తీగలు తెగిపడి మొక్కజొన్న పంట దగ్ధమైంది. అక్కడే ఉన్న రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఈ ఘటనలో ఒక ఎకరం మొక్కజొన్న పంట కాలి బుడిదైంది. నష్టపోయిన పంటకు ప్రభుత్వ నుండి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

రేషన్ షాపుల ద్వారా 12 రకాల వస్తువులు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వాలు రేషన్ షాపుల ద్వారా పేదలకు 12 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రగతిశీల యువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఆయా రేషన్ దుకాణాల ఎదుట పోస్టర్లను అతికించారు. ప్రస్తుతం దుకాణాల ద్వారా బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారని, నిత్యావసర సరుకులు 12 రకాలను కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు జగన్ సింగ్, అశోక్, శ్యాంసుందర్, రజనీకాంత్ ఉన్నారు.

ప్రధాని సభకు తరలిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-బాసర

దేశ ప్రధాని నరేంద్ర మోడీ పరేడ్ మైదానంలోని బహిరంగ సభకు శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రెండు వాహనాలు బయలుదేరి వెళ్లారు. వీరి వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుభాష్ యాదవ్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆదిలాబాద్ లెక్చరర్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణానికి చెందిన లెక్చరర్‌కు డాక్టరేట్ బిరుదు లభించింది. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బిర్కుర్‌వార్ రవీందర్ ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. రాధా గోవింద్ యూనివర్సిటీ రాంచి రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధన చేసినందుకు ఆ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ బ్రాట్ సింగ్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ నుండి 'ఇంప్లీమెంటేషన్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ కేటాలైటిక్ సిస్టమ్ బై యూస్ ఆఫ్ నోవెల్ ఆర్గనో హలోజన్ కంపౌండ్స్ '(కార్బన హలోజన్ సమ్మేళనాలను ఉపయోగించి పరివర్తన లోహ ఉత్ప్రేరక వ్యవస్థ అమలు) అనే అంశంపై రిసెర్చ్ చేసినందుకుగాను డాక్టరేట్ బిరుదుతో యూనివర్సిటీ సత్కరించింది. కాగా లెక్చరర్ రవీందర్‌కు డాక్టరేట్ బిరుదు లభించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ స్వామి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను మోడీ అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడారు. నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని అన్నారు. హామీలు హామీలుగానే మిగిలాయని అన్నారు. సింగరేణిని ప్రయివేటీకరించబోమని మాట్లాడారని, అబద్దాల ప్రధానమంత్రిగా ఇచ్చిన వాగ్దానాలను, మాట్లాడిన మాటలను మరిచి మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చాడని అన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేట్ పరం చేయడం, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడం పనిగా పెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, నిర్మల్ పట్టణ కార్యదర్శి శీతల్కర్ అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, ఆకొండపేట గ్రామసర్పంచ్ సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు దుర్గం పోశలింగం, ఆఫీస్ కార్యదర్శి అఫ్జల్ పాల్గొన్నారు.

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-నిర్మల్

తమ వాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు కాకుండా, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించి నడిపితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. శనివారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు యువత కంపెనీ నుండి వచ్చిన సైలెన్సర్లను వాడకుండా ఎక్కువ శబ్దంవచ్చే సైలాన్సర్‌లను బిగిచి వాహనాలు నడుపుతూ ప్రజలను ఇబ్బందులు గురిచేస్తూ, శబ్ద కాలుష్యం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. సంబంధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ పిల్లలు ఎటువంటి ఇటువంటి దుశ్చర్యాలకు పాల్పడకుండా చూడాలని అన్నారు. లేని పక్షంలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా, శివాజీచౌకలో వందకు పైగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లను, రోడ్డు రోలర్‌తో తొక్కించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లేష్, ట్రాఫిక్ ఎస్ఐలు దేవేందర్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ విభజన హామీలు కేంద్రం అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ విభజన హామీలు కేంద్రం అమలు చేయలేదని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ శనివారం హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయం సమీపంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఆదిలాబాద్ ఫ్లైఓవర్లు ఏర్పాటు సంబంధించింది అనేక హామీలు కేంద్రం అమలు చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విభజన హామీల్లో దాదాపు నిధులు నేటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటే తెలంగాణకు మోడీ కేవలం రాజకీయ లాభం కోసమే వస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ విభజన హామీలు నెరవేర్చిన తర్వాతనే తెలంగాణలో అడుగు పెట్టాలని సీపీఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళినిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, మేస్రం భాస్కర్, చిలుక దేవిదాస్, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, గేడం కేశవ్, గిరిజన సంఘం నాయకులు గేడం పొచ్చిరాం, కొడప సురేష్, అమిన, కృష్ణవేణి, ఖండాల గణేష్, రామదాస్ పాల్గొన్నారు.

బీసీ సంఘాల అభ్యున్నతికి కృషి

- విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

బీసీ సంఘాల అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తానని విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు లోక భూమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా లోక భూమారెడ్డి మాట్లాడుతూ బీసీ సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అందరూ ఐక్యమత్యంగా ఉంటేనే సంఘాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన మేకల రవికాంత్ యాదవ్, వెంకన్నలను శాలువాలతో సత్కరించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ పోతారెడ్డి, గోక భూమారెడ్డి, బీసీ సంఘాల నాయకులు ఆశన్న యాదవ్, గాజుల సాంబశివ్, రమాకాంత్, జనార్దన్, శశికాంత్, రుయ్యాడి గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, శ్రీనివాస్, నాయకులు మోతె శ్రీనివాస్, హన్మాండ్లు, రమాకాంత్, రాజన్న, లచ్చన్న, సురేష్, వివిధ గ్రామాల నుండి వచ్చిన బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని ఎఎంసీ చైర్మెన్ ఆశ్రితరెడ్డి అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం మార్కెట్‌కు రూ.కోటి 12లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పాత మార్కెట్‌కు ప్రహరీగోడ నిర్మాణానికి, అలాగే జామ్ గ్రామంలోని మార్కెట్ గోడౌన్ వద్ద సీసీ ఏర్పాటు చేసేందుకు తీర్మానాలు చేశారు. ఇదివరకు దుకాణ సముదాయాల నిర్మాణానికి ప్రతపాదనలు పంపిన వాటికి అనుమతులు రాగానే పనులు ప్రారంభం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ రాథోడ్ దత్తురాం, డీసీసీబీ డైరెక్టర్ ఐర నారాయణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి భూమన్న, ఎట రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు ట్రేడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాల భరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో ఆదివారం జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పథకాలతో భరోసా కేసీఆరే శ్రీరామరక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బండారు శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలతో భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఎంపీటీసీలు సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విధుల్లో మద్యం తాగిన కానిస్టేబుల్ సస్పెన్షన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యం తాగి విధులను నిర్వర్తించిన కానిస్టేబుల్‌ను సస్పెన్షన్ చేసినట్టు ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అర్.గణపతి కానిస్టేబుల్‌కు బందోబస్తు విధులు కేటాయించారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో మద్యంతాగి ఉండటాన్ని గమనించిన బజార్‌హత్నూర్ ఎస్సై వైద్య పరీక్షలకు పంపగా, వచ్చిన రిపోర్ట్ ఆధారంగా జిల్లా ఎస్పీ సస్పెన్షన్ ఉత్తర్వుల జారీ చేశారు.

పది పరీక్షకు 53 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు పగడ్బందీగా కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన పరీక్షకు రెగ్యూలర్ విద్యార్థులు 10,602 మందికి హాజరు కావాల్సి ఉండగా 10,555 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రయివేట్ విద్యార్థులు 24 మందికి గాను 21 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు.

ప్రమాదవశాత్తు ఇరిగేషన్ శాఖ ఉద్యోగి మృతి



నవతెలంగాణ-కడెం

ప్రమాదవశాత్తు కడెం ప్రాజెక్ట్ వరద గేట్లపై నుండి కిందపడి ఇరిగేషన్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని కడెం ప్రాజెక్టు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన బద్ది గంగాధర్(53) ఇరిగేషన్‌శాఖలో కడెం ప్రాజెక్టు వద్ద లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రాజెక్టు వరద గేట్ల లీకేజీలను గడ్డితో పూడ్చి, పైకి ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వరద గేట్ల కిందివైపు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం తీరు పరిశీలించి, విచారణ చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో పొన్కల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దివ్యాంగుల సమస్యలు పరిష్కారించాలి

నవతెలంగాణ-నిర్మల్

దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారించాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ అన్నారు. శనివారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు జారీ చేసి 35 కిలోల బియ్యం ఇవ్వాలని అన్నారు. సబ్సిడీ రుణాలు వెంటనే ఇవ్వాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. దివ్యాంగుల కొరకు సంఘ భవన నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సభ్యులు శివ, నిషిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పోచ్చర సాయి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, జెడ్పీటీసీ సంధ్యారాణి, స్థానిక సర్పంచ్ సుగుణ, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు ఎలక రాజు, సోమన్న, లక్ష్మణ్, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 09 మార్చి 2023
3

వివాదాస్పద భూమిలోని ఆక్రమణ కూల్చివేత

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణం ఆర్ఆర్‌ఓ కాలనీలో ఉన్న వివాదాస్పద భూమిలోని ఆక్రమణను శనివారం అధికారులు కూల్చివేశారు. కూల్చివేత సమయంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే ఆర్ఆర్‌ఓ కాలనీ సమీపంలోని సర్వే నెంబర్ 253లో కొద్ది రోజుల క్రితం ప్రహరీగోడ నిర్మించారు. అప్పట్లోనే ఇది ప్రభుత్వ భూమి అనే ఆరోపణలు వచ్చినా అధికారులు స్పందించలేదు. శనివారం తహసీల్దార్ మునావర్ షరీఫ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యలు జేసీబీతో ప్రహరీ కూల్చివేతకు యత్నించగా, ఆ భూమి తనదేనని మాలి సంఘం నాయకులు, కాగజ్‌నగర్ మండలం చింతగూడ నివాసి లెండుగురె శ్యాంరావు అడ్డుకున్నారు. తన వద్ద అన్ని ఆధారాలున్నాయని ఆయన చెప్పినా వినకుండా అధికారులు కూల్చివేత ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఒక వైపు ప్రహరీ కూల్చివేసిన అధికారులు మిగిలిన ప్రహరీని కూల్చివేయాలని శ్యాంరావుకు చెప్పారు. లేనిపక్షంలో తామే మొత్తం కూల్చివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. టౌన్ ఎస్సై చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు.

సమస్యల సాధనకు నిరవధిక సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యల సాధన కోసమే సమ్మె చేపడుతున్నట్లు జిల్లా పవర్ జాక్ ఛైర్మన్ విలాస్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఇవ్వకుండా విద్యుత్ యాజమాన్యం జాప్యం చేస్తోందని అన్నారు. గతంలో దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా యాజమాన్యం నుండి స్పందన లేకపోవడంతోనే సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 16లోపు విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో 17 నుండి సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమ్మె సన్నాహక సదస్సుకు ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ఎమ్మాజి సతీష్, రమేష్, చంద్రశేఖర్, మురళి, ధర్మయ్య, ప్రవీణ్, శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రయివేటికరణను విరమించుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

దేశ ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ రావడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో బస్టాండ్ సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ నాయకులు ప్రేమ్ కుమార్, మహేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చ లేదని, తెలంగాణకి గుండెకాయ లాగా ఉండే సింగరేణినీ ప్రైవేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని అన్నారు. తెలంగాణ ప్రజానీకానికి అన్యాయం చేయడానికి బీజేపీ ప్రభుత్వ నాయకులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న అనేక సంస్థలను ప్రైవేటు పరం చేయడమే కాకుండా కొన్ని సంస్థలను మూసి వేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందనీ ఆరోపించారు. నరేంద్ర మోడీకి తెలంగాణ పట్ల, తెలంగాణ ప్రజల పట్ల కొంచమైనా ప్రేమ ఉంటే విభజన హామీలను నెరవేర్చి సింగరేణి ప్రయివేటీకరణను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో బీజేపీని తెలంగాణలో అడుగడుగున అడ్డుకోవడం తోపాటు తెలంగాణ ప్రజలు భూ స్థాపితం చేస్తారని అన్నారు.

సింగరేణి గనులపై నల్ల బ్యాడ్జీలతో నిరసన

రామకృష్ణాపూర్ : సింగరేణి ప్రయివేటీకరణ చేయమంటూ చెప్పి కొత్త బొగ్గు బ్లాక్‌లను వేలంపాటలో పెట్టిన నరేంద్ర మోడీ హైదరాబాద్‌కు రావడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కెకె-5 గనిపై సీఐటీయూ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నిరసనలు తెలిపారు. అనంతరం మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు సాంబారు వెంకటస్వామి మాట్లాడుతూ జాతీయ సంపద అయిన బొగ్గును ప్రభుత్వం చేతిలో కాకుండా కార్పొరేట్లకు, విదేశీ సంస్థల పెట్టుబడిదారులకు అప్పచెప్పుతూ బొగ్గు రంగాన్ని, ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. సింగరేణి ప్రయివేటీకరించం అంటూనే సింగరేణి నిధులతో ఎక్స్‌ప్లోరేషన్ చేసిన గనులను అనుమతులు ఇవ్వకుండా వేలంపాటలో పెట్టడం ప్రైవేటీకరించడం కిందికి రాదా అని ప్రశ్నించారు. సింగరేణి పరిరక్షణ కొరకు ఐక్యంగా అన్ని కార్మిక సంఘాలు కలిసి పోరాటం చేయాలని సూచించారు. రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండి ఇప్పుడు నిరసనలు తెలియజేస్తున్నారని, ఇదే దూకుడును భవిష్యత్తులో కూడా ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్, జోరుక వెంకటేష్, వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, చైతన్యరెడ్డి, వి.శివ, కలవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడీ పర్యటనను నిరసిస్తూ

ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ ఎస్సిడబ్ల్యూయూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆర్ కె1ఏ, ఆర్కెసిహెచ్‌పి, ఆర్కె ఓసిపి గనులపై నల్ల జెండా, బ్యాడ్జిలతో నిరసనలు తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి కి సంబంధించిన 4 బొగ్గు బ్లాక్‌ను ప్రయివేట్‌లో వేలం వేయకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలనీ, కేంద్ర ప్రభుత్వం ఇలానే మొండిగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో బొగ్గు గని కార్మికులను ఏకం చేసి సమ్మెకు సిద్ధంఅవుతామణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ, ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీలు సురమళ్ళ వినయ్, ఏ.సంజీవ్, ఏ.ఆంజనేయులు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు గోవిందుల రమేష్, హరీరామ కృష్ణ,రామకృష్ణ ఫిట్ కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య పాల్గొన్నారు.



నస్పూర్ : దేశ ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ రావడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్‌లోని ఓసి, నర్సరీ హైవే వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుంది. ముఖ్యంగా దేశంలోని 106 బొగ్గుబావులను, మన రాష్ట్రంలో 4 బొగ్గు బావులను కూడా వేలంపాటలోకి చేర్చింది. సింగరేణిని ప్రయివేటీకరణ చేసే దిశగా మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్, బానేష్, గట్టు మహేందర్, కుమారి, కళ, లక్ష్మి, సరోజన్, భాగ్య, స్వరూప పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.





పది వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయి కుంట ప్రాంతంలో గల చెన్నూర్ రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల లోనికి ఎవరిని మొబైల్ ఫోన్ తీసుకువెళ్ళేందుకు అనుమతించకూడదని తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08736-252420 నెంబర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు.

ఆసిఫాబాద్ : పదో తరగతి పరీక్ష కేంద్రల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. తిర్యాని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. పరీక్ష నిర్వహణ సిబ్బంది, పోలీస్ సిబ్బందికి మొబైల్ ఫోన్స్ లోనికి అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, ఏ సమస్య ఉన్న వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని పరీక్ష నిర్వహణ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, రెబ్బెన సీఐ నరేందర్, తిర్యాని ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

భీమిని : భీమిని మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో పదోవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ సాఫ్దర్ అలీ శనివారం సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చూసి రాయడానికి లేదా మాస్ కాపీకి పాల్పడవద్దని అన్నారు.

10 నుంచి పూలే, అంబేడ్కర్ సందేశ్ యాత్ర

నవతెలంగాణ-మంచిర్యాల

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి పూలే అంబేద్కర్ సందేశ యాత్రను నిర్వహించనున్నామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ తెలిపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో యాత్రకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన మోడీ సర్కార్ రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ద్వారా దళిత గిరిజన బలహీన వర్గాల రిజర్వేషన్లకు గండి కొడుతుందని పేర్కొన్నారు. దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం రావలసిన నిధులు రాకుండా ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ చట్టాన్ని నీతి అయోగ్ పేరిట నిర్వీర్యం చేస్తున్నదని తెలిపారు. బహుజన మహనీయులు పూలే అంబేద్కర్ అందించిన సామాజిక న్యాయ ఎజెండాను జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో ప్రచారం చేయడానికి కేవీపీఎస్ ఉద్యమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల నరేష్, ఉపాధ్యక్షుడు వంజరి గోపి, మిడివెల్లి రాజ్ కుమార్, రాములు, ప్రేమ్ కుమార్ మహేష్ పాల్గొన్నారు.

గంగాజలానికి బయలుదేరిన శ్రీకృష్ణ భక్తులు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తలోడి పంచాయతీలోని దనోర్‌హెట్టి గ్రామంలో గత మూడు రోజుల నుంచి శ్రీకృష్ణ జెండాలను భక్తులు ఊరేగిస్తున్నారు. దనోర్‌హెట్టి, తలోడి, నదిమాబాద్ గ్రామాల్లో తిరిగిన పోతురాజు, శ్రీకృష్ణుని నీలవరుడి జెండాలు తిరిగాయి. శనివారం మధ్యాహ్నం పాదయాత్రగా దనోర్‌హెట్టి నుండి తాటిపెల్లి వద్ద పెన్‌గంగ నదికి వెళ్లారు. అక్కడ పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గంగాజలం తీసుకురానున్నట్లు భక్తులు పేర్కొన్నారు. తీసుకొచ్చిన గంగాజలాన్ని ఆదివారం శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అగ్నిగుండాల ప్రవేశం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేయనున్నట్లు పూజారి భీమయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహేష్, శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబేద్కర్‌చౌక్ వద్ద అంబలి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాదళం జిల్లా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా(తారీక్) మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి అంబలి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ప్రతి శనివారం అంబలి పంపిణీ చేస్తామన్నారు. సంఘ కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు హైమద్ పాల్గొన్నారు.

బట్టి విక్రమార్కను కలిసిన మందమర్రి పట్టణ అధ్యక్షులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హాథ్ సే హాథ్ జోడు కార్యక్రమంలో భాగంగా సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్కను శనివారం మందమర్రి మండల అధ్యక్షులు జీవన్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మందమర్రి మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్ల శీను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాతి రాజయ్య, భీమారం మండల అధ్యక్షులు, నరేందర్, క్యాతనపల్లి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పనాస రాజు, మందమరి పట్టణ ప్రధాన కార్యదర్శి అంకం రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపిటిసి మాస్ సంతోష్, ఐఎన్టీయూసీ నాయకుడు చంద్రగిరి ఎల్లయ్య పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం..బనార్వాడలో నివాసం ఉంటున్న చాప్లే శంకర్(39) రోజులాగే మద్యం తాగి ఇంట్లో పడుకున్నాడు. చాలాసేపు నిద్ర పోవవడంతో తల్లి శంకర్‌ను లేపడానికి ప్రయత్నించింది. ఎంతకీ లేవకపోవడంతో ఇరుగుపొరుగు వారి సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చింది. వైద్యులు పరీక్షించి మరణించినట్లు ధ్రువీకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాణాప్రతాప్ తెలిపారు.

సింగరేణి ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నాలో మంత్రి ఐకేరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, సింగరేణి ప్రయివేటీ కరణను కాంగ్రెస్ అడ్డుకుంటుందని అటవి, దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు నస్పూర్ మున్సిపాలిటీలోని సీసీసీ కార్నర్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి ఒక ఆర్థిక, సామాజిక జీవనాడిలాంటిదని, సింగరేణి నల్ల బంగారం తెలంగాణకు కొంగుబంగారం అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తుందని, కేంద్రం కుట్రలకు నిరసనగా మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం కేంద్రాల్లో కార్మికులు బగ్గుమన్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు గనుల వేలం ప్రక్రియ ప్రయత్నం చేసిన ప్రయివేటు కంపెనీల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, మరోవైపు ఇవే గనులని నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మరోసారి సత్తుపల్లి బ్లాక్ 3, శ్రావణ పల్లి, పెనగడప గనులను వేలం వేయడం దుర్మార్గమైన చర్య అని, మార్చి 29 నుంచి మే 30 వరకు గనులకు వేలం వేసే ప్రక్రియను నిలిపివేసి నేరుగా సింగరేణికి గనులు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణికి అవసరమైన బొగ్గు గనులను నేరుగా కేటాయించాలని కేసీఆర్ 2021 డిసెంబర్ 7న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన కేంద్రం పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వం సింగరేణిని కూడా అనమ్మాలని కంకణం కట్టుకుందని విమర్శించారు. లాభాల బాటలో వున్న సింగరేణికి భవిష్యత్తులో బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల బాట పట్టించాలన్న కుతంత్రం కేంద్రం చేస్తుందని, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ బండి సంజయ్ ఉన్నారని తెలిపారు. బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీజేపీ నాయకులను సింగరేణి ప్రాంతాల్లో తిరుగనివ్వరని హెచ్చరించారు. పేపర్ లీకేజీల వ్యవహారం వెనుక కేంద్రం పెద్దల హస్తం ఉందని బాల్క సుమన్ ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎవరిని వదలొద్దని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ పట్ల తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ పార్టీ విధానాలన్నీ తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కూడా



గనులు కేటాయించకుండా ఆ సంస్థను దివాలా తీయించిన కేంద్రం అదే విష ప్రయోగాన్ని ఇక్కడ అమలు చేయాలని చూస్తుందన్నారు. పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో ఎట్టపరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఇదే కేంద్ర ప్రభుత్వం గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కి మాత్రం నామినేషన్ పద్ధతిన భారీగా లిగ్నైట్ గనులు కేటాయించిందని, గుజరాత్‌కు ఒక న్యాయం తెలంగాణకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. సింగరేణి సంక్షోభంలోకి వెళితే దక్షిణ భారతదేశ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ కుప్పకూలుతుందనే సంగతి ప్రధానికి తెలియదా అని ప్రశ్నించారు. సింగరేణి ప్రైవేటీకరణ అనేది కేవలం ఆరు జిల్లాల సమస్య కాదని, సమస్త తెలంగాణను దెబ్బతీసే అంశం అని, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే భారీ కుట్రలో భాగంగానే ఇది జరుగుతుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర థర్మల్ పవర్ జనరేషన్‌లో సింగరేణి పాత్ర అత్యంత కీలకమైనదని, దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు, గృహ అవసరాలకు 24 గంటల పాటు ఇస్తున్న నాణ్యమైన విద్యుత్ సరఫరాను అడ్డుకోవాలన్న దురాలోచనతోనే కేంద్రం సింగరేణిపై కక్ష కట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్, ఆసిఫాబాద్ ఆత్రం సక్కు, బెల్లంపల్లి దుర్గం చిన్నయ్య, జడ్పీ చైర్‌పర్సన్‌లు నల్లాల నల్లాల భాగ్యలక్ష్మి, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు అరవిందరెడ్డి, నల్లాల ఓదెలు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ ,జిల్లా ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణ్, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

- ఉత్సవాల్లో ఎమ్మెల్యే రేఖా నాయక్ పలువురు వక్తలు



నవతెలంగాణ-జన్నారం

మహనీయులైనటువంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్‌రాం, కుమురంభీం, సావిత్రిబాయి పూలే, సేవాలాల్ మహారాజ్, ఆశయాలను కొనసాగిద్దామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, తెలంగాణ రాష్ట్ర ఐటీడీఏ చీఫ్ ఇంజనీర్ మురి మడుగుల శంకర్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే మహిళలు ఉన్నత స్థాయిలలో ఉన్నారన్నారు. బాబాసాహెబ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జోతి బాపులే, బాబు జగ్జీవన్‌రాంలు ఒకే నెలలో జన్మించటం ఇలా మనం మహనీయుల జయంతి ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషం కలిగించే విషయం అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వల్లే మనం మానవ విలువలు నేర్చుకున్నామని అన్నారు. ఆనాడు మహనీయులు మనకోసం వారు సమ సమాజ స్థాపన కోసం వారు చేసిన కృషి వెలకట్టలేని కొనియాడారు. గిరిజన తండాలకు మరియు గ్రామాలకు మంచి విద్య వ్యవస్థను అందజేశారన్నారు. ఈ నెల 14 వ తేదీన ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల ఎత్తులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారని తెలిపారు. నేడు తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్, ఐటీఓ అధికారి ప్రకాష్ రాథోడ్, నేతకాని మహర్ కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, హైకోర్టు అడ్వకేట్ బోర్లకుంట దీపక్ కుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, మండల అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీ ఖాన్, జాడి మురళి, ఓయూ జేఏసీ నాయకులు విజేందర్ పవర్, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలో ఈ నెల 14న నిర్వహించే సత్యాగ్రహ దీక్ష, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పెద్దనపల్లి సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ గారిపై అన్వరత వేటుకు నిరసనగా దేశంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా జై భారత్ సత్యాగ్రహ దీక్ష, భారీ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు (ఏఐసిసి) మల్లికార్జున్ ఖర్గే, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌ఘడ్ సీఎం భూపేష్ భాగేల్, జాతీయ కార్యదర్శులు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇంఛార్జి మానిక్‌రావు ఠాక్రే, అలాగే రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ భట్టివిక్రమార్క, జాతీయ కార్యదర్శులు నదీమ్ జావేద్, రోహిత్ చౌదరి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మన రాష్ట్రంలోని ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీతక్క, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పోదెం వీరయ్య, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు ముఖ్య నాయకులు వస్తున్నారని, అదే రోజు భట్టి విక్రమార్క పాదయాత్ర కూడా అక్కడికి చేరుకుంటుందని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీ పార్వతి మల్లేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, సీనియర్ నాయకులు మైదం రమేష్, అంజన్న, ఉడుతల రాజన్న, ఓరియంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షుడు అన్నం కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు జాడి శివ, ఏల్పుల వెంకటేష్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.